ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి దిన పత్రిక కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు, ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఏవైనా సమస్యలుంటే క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
A.C.O - 9003200801
S.R - 9551168092
27/11, సౌందరరాజన్ స్ట్రీట్, టి.నగర్, చెన్నై-600017

భోగి సందడి

● రాష్ట్ర ప్రజలకు నేతల శుభాకాంక్షలు

ప్యారీస్, జనవరి 13: పెద్ద పండుగ అయిన సంక్రాంతిలో భాగంగా మొదటి రోజు ఆదివారం భోగభాగ్యాలు ప్రసాదించే భోగి పండుగ జరుపుకొనేందుకు రాష్ట్రప్రజలు సిద్ధమయ్యారు. సూర్యోదయానికి ముందే నిద్రలేచి ఇళ్ల ముందు భోగి మంటలు వేసుకొని ఇంటిల్లిపాది చలి కాచుకుంటారు. నూతన సంవత్సరంలో భోగి రోజున పాతకు స్వస్తి చెప్పి నూతనత్వానికి స్వాగతం పలుకుతూ మంటల్లో పనికిరాని బట్టలు, వస్తువులు వేసి పీడలను, అరిష్టాలు తొలగించాలంటూ తమ ఇష్టదైవాలను ప్రార్థిస్తారు. ఇదిలా ఉండగా, పర్యావరణాన్ని పరిరక్షించే విధంగా రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి విధించిన నిబంధనల మేరకు టైర్లు, ప్లాస్టిక్ తదితరాలను భోగిలో వేయకుండా ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు కలప, పాత బట్టలతో కాలుష్యరహితంగా జరుపుకోవాలని రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం నుంచే అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.



చెన్నైలో జరిగిన సంక్రాంతి వేడుకల్లో ఓ కళాశాల విద్యార్థినులు

డప్పులతో చిన్నారుల సందడి...

భోగి పండుగ అంటేనే గుర్తుకొచ్చేది చలి మంటలు, ఆ మంటల చుట్టూ డప్పులు మోగిస్తూ చిన్నారులు చేసే సందడే. మారుతున్న రోజులకు అనుకూలంగా పదేళ్ల క్రితం వరకు పశువుల చర్మంతో తయారుచేసిన డప్పులు వాడే సంస్కృతి కనుమరుగై, ప్రస్తుతం ప్లాస్టిక్ డప్పులు ఈ పండుగకు అందుబాటులోకి వచ్చాయి. రకరకాల డిజైన్‌లతో తయారుచేసిన డప్పుల విక్రయాలు కూడా శనివారం ఊపందుకున్నాయి. కాగా, భోగి, మకర సంక్రాంతి, కనుమ, కానుం పొంగల్ పర్వదినాల సందర్భంగా రాష్ట్రప్రజలకు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి సహా పలువురు రాజకీయపార్టీల నేతలు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సంక్రాంతి ఇండియా కూటమిని విజయపథంలోకి తీసుకెళ్తుందని ఆశిస్తున్నట్లు సీఎం స్టాలిన్ తెలిపారు. అలాగే, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమిళులు సంప్రదాయ పండుగను జరుపుకొని ఆరోగ్యంగా గడపాలని, గత ఏడాదిలాగా తుఫాను, వరదలు సంభవించకుండా ప్రజలంతా సుఖంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నట్లు సీఎం తన సందేశంలో తెలిపారు.



డప్పు కొట్టి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీఎం స్టాలిన్

‘చెన్నై సంగమం’ ప్రారంభం

● డప్పు మోగించి ప్రారంభించిన సీఎం స్టాలిన్

ప్యారీస్, జనవరి 13: స్థానిక ఐల్యాండ్ మైదానంలో ‘చెన్నై సంగమం - నమ్మ ఊరు తిరువిళా’ పేరిట ఏర్పాటు చేసిన కళా ప్రదర్శనను శనివారం సాయంత్రం 6 గంటలకు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ డప్పు మోగించి ప్రారంభించారు. ఈనెల 18వ తేదీ వరకు 1500 మందికి పైగా జానపద కళాకారులు నగరంలోని ఐలాండ్ గ్రౌండ్, పెరంబూరు, మైలాపూర్, జెమిని సర్కిల్‌లోని సెమ్మొళి పార్కు, నుంగంబాక్కం, టి.నగర్, ట్రిప్లికేన్, బిసెంట్ నగర్, తిరువాన్మియూరు, సైదాపేట తదితర ప్రాంతాల్లో 40 రకాల ప్రదర్శనలతో సందడి చేయనున్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా భోగి, సంక్రాంతి, మకర సంక్రాంతి పర్వదినాల సందర్భంగా నగరవాసుల కోసం రాష్ట్రప్రభుత్వం చెన్నై సంగమం కళా ప్రదర్శనను ఏర్పాటు చేసింది. గత డీఎంకే ప్రభుత్వ హయాంలో 2007లో పొంగల్ సందర్భంగా చెన్నై సంగమం పేరుతో డీఎంకే ఎంపీ కనిమొళి సారథ్యంలో కళా ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన అన్నాడీఎంకే ప్రభుత్వం ఈ కార్యక్రమాలను నిలిపివేసింది. ఇపుడు రాష్ట్రంలో డీఎంకే ప్రభుత్వం ఉండటంతో చెన్నై సంగమం కార్యక్రమాన్ని తిరిగి చేపట్టారు. ప్రారంభోత్సవం సందర్భంగా గ్రామీణ కళాకారులు వివిధ రకాల నృత్యాలు, వాయిద్య సంగీతాలతో ప్రేక్షకులను అలరించారు. ఒకే వరుసలో డప్పు వాయించి యువకులు చేసిన సందడి ఆకట్టుకుంది. ఇక కీలుగుర్రం, నెమలి నృత్యం, గరగాట్టం, వయిలాట్టం అంటూ గ్రామీణ జానపద కళాకారులు చేసిన నృత్యాలు నగర వాసులను మైమరపించాయి.

సంగీత విభావరి



కానుంపొంగల్‌కు 3వేల మంది పోలీసులతో భద్రత



చెన్నై, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఈనెల 17న కానుం పొంగల్‌కు మెరీనా బీచ్‌ను లక్షలాదిమంది ప్రజలు సందర్శించనుండటంతో వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మూడువేల మంది పోలీసులతో పటిష్ఠ భద్రత కల్పించనున్నారు. యేటా సంక్రాంతి, పశువుల పండుగ ముగిసిన తర్వాత చెన్నైలో కానుంపొంగల్‌ను ఘనంగా జరుపుకోవటం ఆనవాయితీ. ఆ రోజున గ్రామీణ ప్రజలు నదీ తీరాలలో పిల్లాపాపలతో గుమికూడి సందడి చేస్తుంటారు. ఆ ప్రాంతాల వద్ద వివిధ రకాలైన వంటలను వండుకుని ఆరగిస్తారు. అయితే రాజధాని నగరంలో చెన్నైలో కానుంపొంగల్ రోజు సాయంత్రం నగరవాసులంతా మెరీనా బీచ్‌ని సందర్శిస్తుంటారు. బీచ్‌లో లక్షలాదిమంది గుమికూడి ఆటపాటలతో సందడి చేస్తారు. దుకాణాల్లో తినుబండారాలను కొని ఆరగిస్తుంటారు. బాలబాలికలు రంగుల రాట్నాలెక్కి తిరుగుతారు. యువకులు గుర్రాలెక్కి సవారీ చేస్తారు. బొమ్మలాటలు కూడా ఆడుతారు. ఈ వేడుకల సందర్భంగా గుమికూడే జనానికి గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్ స్వీయ పర్యవేక్షణలో గట్టి భద్రతా ఏర్పాట్లు చేపట్టనున్నారు. అడిషనల్ కమిషనర్ ప్రేమానంద్‌సిన్హా, డిప్యూటీ కమిషనర్ ధర్మరాజ్ తదితర సీనియర్ పోలీసు అధికారులు మెరీనా బీచ్ లైట్‌హౌస్ నుంచి అన్నాదురై సమాధి ప్రాంతం వరకు తీరం పొడవునా ఏర్పాటు చేయాల్సిన భద్రతా ఏర్పాట్లపై సమీక్షించారు. అదే సమయంలో సంక్రాంతి నుంచి కానుంపొంగల్ దాకా మెరీనా బీచ్‌లో సందర్శకులు సముద్రంలో స్నానం చేయకుండా కట్టుదిట్టం చేయనున్నారు. బీచ్ అంతటా వాచ్ టవర్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తారు. డ్రోన్ల ద్వారా జనం కదలికలపై పోలీసులు నిఘా వేయనున్నారు. కానుం పొంగల్ రోజు సాయంత్రం ఎవరూ సముద్ర స్నానానికి వెళ్లకుండా కొయ్యలతో బ్యారికేడ్లను ఏర్పాటు చేయనున్నారు. ఇదే విధంగా కానుం పొంగల్ రోజున నగరవాసులు గిండీ చిల్డ్రన్స్ పార్కు, అన్నా ఫ్లైఓవర్ సమీపంలోని సెమ్మొళి పూంగా తదితర ఉద్యానవనాలలను కూడా సందర్శిస్తుంటారు. దీంతో ఆ ప్రాంతాల వద్ద కూడా పోలీసులు భద్రతా విధులు నిర్వర్తించనున్నారు. ఈ నెల 16 నుంచి 17 వరకు నగరమంతటా సుమారు 16 వేల మంది పోలీసులతో భద్రత కల్పించనున్నట్లు నగర పోలీసు కమిషనర్ సందీప్ రాయ్ రాథోడ్ తెలిపారు.

రాష్ట్రంలో సాఫీగానే సీట్ల సర్దుబాటు

● ‘ఇండియా’ కూటమి భేటీలో సీఎం స్టాలిన్

చెన్నై, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ‘ఇండియా’ కూటమిలో జరిగిన సీట్ల సర్దుబాటు భేటీలో డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్, ఆయన సోదరి, డీఎంకే మహిళా విభాగ కార్యదర్శి కనిమొళి పాల్గొన్నారు. కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలోని ఏన్డీయే ప్రభుత్వ పదవీకాలం జూన్ 16న ముగియనుంది. ఈ నేపథ్యంలో ఏప్రిల్ లేదా మే నెలలో లోక్‌సభ ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఇండియా కూటమిలోని 27 పార్టీలు కలిసికట్టుగా సీట్ల సర్దుబాట్లు చేసుకుని ఎన్నికల బరిలోకి దూకాలని నిర్ణయించాయి. పట్నా, బెంగళూరు, ముంబై, ఢిల్లీ నగరాలలో ఈ కూటమి నాయకుల సమావేశాలు వరుసగా జరిగాయి. శనివారం ఉదయం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ కూటమి నాయకులు మళ్లీ సమావేశమయ్యారు. డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్ స్థానిక ఆళ్వార్‌పేటలోని తన నివాస గృహం నుంచి ఈ సమావేశానికి హాజరయ్యారు. స్టాలిన్‌తోపాటు ఆయన సోదరి కనిమొళి కూడా పాల్గొన్నారు. ఆ సందర్భంగా కూటమికి నాయకత్వం వహిస్తున్న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ... వీలైనంత త్వరగా సీట్ల సర్దుబాట్లు ముగించాలని కోరారు. స్టాలిన్ స్పందిస్తూ... తమ రాష్ట్రానికి సంబంధించినంత వరకూ డీఎంకే కూటమిలో సీట్ల సర్దుబాట్లు సాఫీగా జరుగుతుందని తెలిపారు. అదే సమయంలో ఇతర రాష్ట్రాల్లో కూటమి భాగస్వామ్య పార్టీలు సీట్ల సర్దుబాట్లను వీలైనంత త్వరగా ముగిస్తే త్వరగా ప్రచారం సాగించడానికి వీలుపడుతుందన్నారు. బీజేపీ ఈ నెలాఖరులోగా అభ్యర్థుల జాబితాను విడుదల చేసే అవకాశం ఉంది కనుక ఇండియా కూటమి త్వరగా సీట్ల సర్దుబాట్లు చేసుకుని అభ్యర్థుల జాబితాను విడుదల చేస్తే మంచిదని నాయకులు చెప్పారు. ఈ సమావేశానికి పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ నాయకురాలు మమతా బెనర్జీ హాజరుకాలేదు. సుమారు రెండు గంటలపాటు ఈ సమావేశం కొనసాగింది.



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇండియా కూటమి సమావేశంలో పాల్గొన్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, ఆయన సోదరి, ఎంపీ కనిమొళి

వరద సాయాన్ని విడుదల చేయండి

అమిత్‌షాకు రాష్ట్ర ఎంపీల వినతి ● ఢిల్లీలో కలిసి వినతిపత్రం అందజేత

అడయార్, జనవరి 13: రాష్ట్రానికి తక్షణం వరద సాయం నిధులను విడుదల చేయాలని కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు రాష్ట్రానికి చెందిన అఖిల పక్ష ఎంపీల బృందం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఎంపీలు శనివారం ఢిల్లీలోని అమిత్‌షా నివాసంలో ఆయన్ను కలుసుకుని వినతిపత్రం సమర్పించారు. డీఎంకే పార్లమెంటరీ నేత టీఆర్ బాలు నేతృత్వంలో అఖిల పక్ష ఎంపీలు హోంమంత్రిని కలిశారు. గత డిసెంబరు నెల మూడు, నాలుగు తేదీల్లో మిచౌంగ్ తుఫాను కారణంగా కురిసిన అతి భారీ వర్షానికి చెన్నై నగరం వరద నీటిలో చిక్కుకుంది. ముఖ్యంగా నగర లోతట్టు ప్రాంతాలన్నీ జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఆ తర్వాత 17, 18 తేదీల్లో కురిసిన భారీ వర్షాలకు కన్నియాకుమారి, తిరునెల్వేలి, తూత్తుకుడి, తెన్‌కాశి జిల్లాలు నీట మునిగాయి. ఆయా ప్రాంతాల్లో ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టి, వరద బాధితులను రక్షించారు. వరద బాధిత ప్రాంతాల్లో ఒక్కో కుటుంబానికి రూ.6 వేలు చొప్పున రాష్ట్రప్రభుత్వం ఆర్థిక సాయం అందించింది. వరద బాధిత ప్రాంతాల్లో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఆ తరువాత కేంద్ర బృందాలు పర్యటించి వరద నష్టాన్ని అంచనా వేశాయి. అయితే, కేంద్రం మాత్రం తాత్కాలిక వరద సాయంగా విపత్తుల సహాయ నిధి కింది కొద్దిగా ఆర్థిక సాయం చేసింది. అయితే, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం వరద నష్టంపై నివేదిక తయారు చేసింది. ముఖ్యంగా తాత్కాలిక సహాయక చర్యల కోసం రూ.7,959 కోట్లు, శాశ్వత పునరావాస సహాయక చర్యల కోసం రూ.17,952 కోట్లు ఇవ్వాలని కేంద్రాన్ని కోరింది. ఇదే విషయంపై ప్రధాని నరేంద్రమోదీని సీఎం స్టాలిన్ స్వయంగా ఢిల్లీలో కలుసుకుని వినతిపత్రం సమర్పించారు. అయితే, కేంద్రం నుంచి ఎలాంటి స్పందన లేదు కదా, ఒక్క పైసా కూడా విడుదల చేయలేదు. ఈ నేపథ్యంలో రాష్ట్రానికి చెందిన ఎంపీలు డాక్టర్ కె.జయకుమార్, వైగో, సుబ్రమణియన్, ఎస్.వెంకటేశన్, డాక్టర్ డి.రవికుమార్, కె.నవాస్ ఖనీ, ఏకేపీ చిన్నరాజ్, సీనియర్ ఎంపీ టీఆర్ బాలు సారథ్యంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షాను మరోమారు కలిసి వరద సాయం నిధులను విడుదల చేయాలని కోరారు.



అమిత్‌షాతో అఖిలపక్ష ఎంపీలు

నిధుల విడుదలకు చర్యలు...

హోం మంత్రిని కలిసిన తర్వాత టీఆర్ బాలు విలేకరులతో మాట్లాడుతూ... కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు వరద నష్టం, చేయాల్సిన సాయంపై వినతిపత్రాన్ని అందజేశామన్నారు. గతంలో కూడా ప్రధాని మోదీని సీఎం స్టాలిన్ స్వయంగా కలిసి వరద సాయంపై వినతిపత్రం అందజేశారని పేర్కొన్నారు. మిచౌంగ్ తుఫాను వల్ల ఏర్పడిన వరద నష్టానికి తాత్కాలిక చర్యల కోసం రూ.7,033.45 కోట్లు, శాశ్వత సహాయక చర్యలు చేపట్టేందుకు వీలుగా రూ.12,659.24 కోట్లతో కలిసి మొత్తం రూ.19,692.69 కోట్లు కోరినట్టు గుర్తు చేశారు. అలాగే, నాలుగు దక్షిణాది జిల్లాల్లో కురిసిన భారీ వర్షాలకు ఏర్పడిన నష్ట నివారణ కోసం తాత్కాలింగా నిధులు రూ.8,162.14, శాశ్వత సహాయక చర్యల కోసం రూ.9,602.38 కోట్లు చొప్పున మొత్తం రూ.18,214.52 కోట్లు మంజూరు చేయాలని కోరినట్టు పేర్కొన్నారు. రెండు ప్రకృతి వైపరీత్యాల కారణంగా అపారనష్టం ఏర్పడిన ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టేందుకు వీలుగా తక్షణం నిధులను విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని హోంమంత్రిని కోరినట్టు టీఆర్ బాలు తెలిపారు. వరద బాధిత ప్రాంతాల్లో కేంద్ర బృందాలు పలు దఫాలుగా పరిశీలించాయని, ఈ బృందాల నుంచి వరద నష్టంపై నివేదికలు తెప్పించుకుని, ఈ నెల 27వ తేదీలోపు వరద సాయం చేసేలా చర్యలు తీసుకుంటామని అమిత్‌షా హామీ ఇచ్చారని టీఆర్ బాలు పేర్కొన్నారు.

వరద పరిస్థితుల్లో ప్రభుత్వ చర్యలు భేష్

● కేంద్ర పరిశీలక బృందం ప్రశంస



తూత్తుకుడి కలెక్టరేట్ వద్ద వరద పరిస్థితులపై ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనను తిలకిస్తున్న కేంద్ర పరిశీలక బృందం

చెన్నై, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): గత డిసెంబర్ 17, 18 తేదీల్లో తూత్తుకుడి సహా నాలుగు జిల్లాల్లో భారీ వర్షాల కారణంగా ఏర్పడిన వరద పరిస్థితులను రాష్ట్రప్రభుత్వం సమర్థవంతంగా ఎదుర్కొందని కేంద్ర పరిశీలక బృందం సభ్యులు ప్రశంసించారు. తూత్తుకుడి జిల్లాలో శుక్రవారం రెండో విడత పర్యటనను చేపట్టిన ఆ బృందం సభ్యులు శనివారం ఉదయం విలేకరులతో మాట్లాడుతూ... భారీవర్షాల వల్ల ఆస్తినష్టం అధికంగా జరిగినా ప్రాణ నష్టం స్వల్పంగా జరగడానికి రాష్ట్రప్రభుత్వ ముందస్తు చర్యలతోనే సాధ్యమైందన్నారు. ఈ నేపథ్యంలో రెండోసారి కీర్తి ప్రతాప్‌సింగ్ నాయకత్వంలో ఏడుగురు సభ్యుల కేంద్ర పరిశీలక బృందం శుక్రవారం నుంచి మళ్లీ తూత్తుకుడి జిల్లాలో వరద బాధిత ప్రాంతాల్లో పరిశీలన చేపట్టింది. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ కె.లక్ష్మీపతి, రెవెన్యూ కమిషనర్ ఎస్కే ప్రభాకర్, ఉన్నతాధికారులతో సమావేశమైంది. ఆ తర్వాత కేంద్ర బృందం సభ్యులు రెండు జట్లుగా ఏర్పడి, ఓ జట్టు మరవన్‌మడం, మురప్పనాడు, పేరూరు, శ్రీవైకుంఠం, ఏరల్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఇక కేంద్ర రహదారాలు శాఖ చీఫ్ ఇంజనీర్ విజయకుమార్ నాయకత్వంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ అదనపు సంచాలకుడు బాలాజీ, కేంద్ర ఆర్థికశాఖ డిప్యూటీ సంచాలకుడు రంగనాథన్‌తో కూడిన బృందం తూత్తుకుడి కార్పొరేషన్ పరిధిలోని వర్షబాధిత ప్రాంతాల్లో పర్యటించింది. తూత్తుకుడి ప్రభుత్వ వైద్యకళాశాల ఆసుపత్రిలోని వర్షపునీటిలో మునిగిన కేథ్‌లాబ్, రక్తపరిశోధన కేంద్రం తదితర ప్రాంతాలను పరిశీలించారు. ఆ తర్వాత కరుత్తపాలం, ఆదిపరాశక్తినగర్, ఓం శక్తినగర్, మాప్పిళ్లైయూరణి తదితర వరద బాధిత ప్రాంతాల్లో పర్యటించారు. అదే సమయంలో అత్తిమరపట్టి, కోరామ్‌పల్లం చెరువుల వద్ద గండ్లు పడిన ఉన్న ప్రాంతాలను, నీట మునిగిన పంటలను కూడా పరిశీలించారు. పున్నైకాయల్, పళయకాయల్, అగరం, ఆత్తూరు తదితర ప్రాంతాల్లోనూ అధికారులు పరిశీలన జరిపారు.

సమాచార దర్శిని

త్వరలో బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు

ఐసిఎఫ్, జనవరి 13: బీఎస్ఎన్ఎల్ సంస్థ 4జీ సేవలు త్వరలో ప్రారంభించనుందని తమిళనాడు డివిజన్ జనరల్ మేనేజర్ తమిళ్‌మణి తెలిపారు. నగరంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... దేశంలోని అన్ని గ్రామాల్లో రూ.26,316 కోట్లతో 4జీ సేవలు ప్రారంభించేందుకు 2022 జూలై 22వ తేది అనుమతి లభించిందన్నారు. రాష్ట్రంలో 218 ప్రాంతాలు, 516 గ్రామాలు గుర్తించి అందులో 185 రెవెన్యూ గ్రామాలు, అటవీ ప్రాంతం దగ్గరగా ఉన్న 8 గ్రామాల్లో టవర్లు ఏర్పాటు చేశామన్నారు. ఇకపై అన్ని 2జీ, 3జీ సిమ్‌కార్డులను 4జీ సిమ్‌కార్డులుగా మార్చనున్నామని, వినియోగదారులు పాత సిమ్‌కార్డులను సమీపంలోని సేవా కేంద్రాల్లో అందజేసి కొత్త సిమ్‌కార్డులు ఉచితంగా పొందవచ్చని సూచించారు.

ప్రోగ్రెస్ కార్డులు తప్పనిసరి

ఐసిఎఫ్, జనవరి 13: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు తప్పనిసరిగా అందజేయాలని పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రోగ్రెస్ రిపోర్టు కాలక్రమేణా కనుమరుగైంది. ప్రస్తుతం కొందరు ప్రధానోపాధ్యాయులు, తరగతి ఉపాధ్యాయులు మాత్రమే విద్యార్థులకు ఉత్తీర్ణత వివరాల కార్డులు అందజేస్తున్నారు. ఈ నేపథ్యంలో, అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఏడాది నుంచి ప్రోగ్రెస్ కార్డులు తప్పనిసరిగా అందజేయాలని హెచ్ఎంలకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ కార్డుల్లో గ్రేడ్ విధానాన్ని కూడా పాటించాలని సూచించింది. కార్డుల ముద్రణకు రూ.1.02 కోట్లను ప్రభుత్వం కేటాయించింది.

21న క్విజ్ పోటీలు

ఐసిఎఫ్, జనవరి 13: రాష్ట్రంలో 14వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని ఓటరు అవగాహన పథకంలో భాగంగా క్విజ్ పోటీలు ఈ నెల 21వ తేది ఉదయం 10 గంటల నుంచి నిర్వహించనున్నారు. పోటీలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారు https:// www.erolls.tn.gov.in/quiz2024 అనే వెబ్‌సైట్‌లో పేరు, వివరాలు ఈ నెల 18,19 తేదీల్లో నమోదు చేసుకోవాలి. 'భారతదేశంలో ఎన్నికలు' అనే అంశంపై పోటీలు నిర్వహించనున్నారు. వివరాలకు నెం.18004252195‌0లో సంప్రదించవచ్చు.

మెట్రో కార్డు రీచార్జ్ రూ.10

ఐసిఎఫ్, జనవరి 13: మెట్రో కార్డు రీచార్జ్ ఇకపై రూ.10గా మార్చినట్లు సీఎంఆర్ఎల్ తెలిపింది. నగరంలో ఉన్న 41 మెట్రో రైల్వేస్టేషన్‌లలో కాగితపు టిక్కెట్లు, ట్రావెల్ కార్డు, క్యూ ఆర్ ద్వారా టిక్కెట్లు పొందే వసతులు కల్పించారు. ట్రావెల్ కార్డులో రూ.10 నుంచి రీచార్జ్ చేయించుకోవచ్చు. అయితే జాతీయ కార్డులో ప్రారంభమే రూ.100 నుంచి రీచార్జ్ చేయాల్సి ఉంటుంది. ఈ విధానంలో కొన్ని మార్పులను అధికారులు చేపట్టారు. రూ.100 రీచార్జ్ చేయడానికి ప్రజలు ఆసక్తి చూపకపోవడంతో రూ.10 నుంచి రీచార్జ్ చేసుకొనే సౌకర్యం కల్పించినట్లు అధికారులు తెలిపారు.

సెమ్మొళి పార్కులో పారంపర్య కూరగాయల విక్రయం

ఐసిఎఫ్, జనవరి 13: 'నమ్మ చెన్నై నమ్మ సంధై' పేరుతో పారంపర్య కూరగాయల విక్రయాలను సెమ్మొళి పార్కులో ఉద్యానవన శాఖ ప్రారంభించింది. పావూరి సుందరం బెండకాయలు, కన్నాడికత్రి (గాజు వంకాయ), విలసంబాడి ముళ్ల వంకాయ, గాందాడి మిరపకాయ, లేత ఎరుపు గెనుసుగడ్డలు వంటి 37 రకాల పారంపర్య కూరగాయలు రాష్ట్రంలో సాగు చేస్తుండగా, ఇవి ఔషధ గుణం కలిగి ఉన్నాయి. వీటిని ప్రజలు తక్కువ గా వినియోగిస్తున్నారు. వీటి ఔషధ గుణాలపై ప్రజలకు అవగాహన కల్పించేలా స్థానిక తేనాంపేట సెమ్మొళి పార్కులో ఈ కూరగాయల విక్రయాలను ఉద్యానవన శాఖ ప్రారంభించింది. ప్రతి శుక్ర, శనివారాల్లో ఈ విక్రయాలు జరుగుతాయని అధికారులు తెలిపారు.

కిళంబాక్కం బస్‌స్టేషన్‌కు మినీ బస్సు సౌకర్యం

ఐసిఎఫ్, జనవరి 13: స్థానిక కిళంబాక్కం బస్‌స్టేషన్‌కు ఉచిత మినీ బస్సు నడపనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ బస్‌స్టేషన్‌లో ప్రయాణికులకు కల్పించిన వసతులను మంత్రి శివశంకర్ పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... సాధారణంగా ప్రతిరోజు 2,000 బస్సులతో కలిపి పండుగలకు అదనపు బస్సులను నడుపుతున్నామన్నారు. కిళంబాక్కం బస్టాండ్‌కు జాతీయ రహదారి నుంచి మినీ బస్సుల ద్వారా ప్రయాణికులను తరలించే ఏర్పాట్లు చేపట్టామని పేర్కొన్నారు.

17న కోయంబేడు మార్కెట్‌కు సెలవు

ఐసిఎఫ్, జనవరి 13: స్థానిక కోయంబేడు కూరగాయల మార్కెట్‌కు ఈనెల 17వ తేది సెలవు ప్రకటించారు. సంక్రాంతిని పురస్కరించుకొని వ్యాపారులు, కూలీలు సొంతూళ్లకు వెళ్లనుండడంతో ఆ రోజు అన్ని దుకాణాలను మూసి వేయనున్నామని, అయితే పూల మార్కెట్ యథావిధిగా కొనసాగుతుందని మార్కెట్ నిర్వాహకులు తెలిపారు.

టీఎన్‌పీఎస్సీ పరీక్షా ఫలితాల విడుదల

ఐసిఎఫ్, జనవరి 13: టీఎన్‌పీఎస్సీ నిర్వహించిన రెండు పరీక్షా ఫలితాలు విడుదలయ్యాయి. వివిధ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి గత మే 13,14 తేదీల్లో రాత పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షా ఫలితాలు టీఎన్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో విడుదలయ్యాయి. ఉత్తీర్ణులైన వారికి ఈ నెల 22, 23 తేదీల్లో ఇంటర్వ్యూలు జరుగుతాయి.

బస్‌పాస్‌లు పొందేందుకు అవకాశం

ఐసిఎఫ్, జనవరి 13: నెలవారీ బస్‌పాస్‌లు పొందేందుకు విద్యార్థులకు ఈనెల 23వ తేది వరకు అవకాశం కల్పించినట్లు ఎంటీసీ తెలిపింది. ఈ సంస్థలో ఈనెల 16 నుంచి ఫిబ్రవరి 15వ తేది వరకు చెల్లదగిన ఐచ్ఛిక ప్రయాణానికి రూ.1,000 పాస్, నెలవారీ కార్డులు 1 నుంచి 22వ తేది వరకు, 11 నుంచి ఫిబ్రవరి 10వ తేది వరకు చెల్లదగిన 50 శాతం విద్యార్థుల రాయితీ కార్డులు ఈ నెల 1 నుంచి 13వ తేది వరకు కౌంటర్‌లో విక్రయించారు. సంక్రాంతిని పురస్కరించుకొని ఈ గడువును 23వ తేది వరకు పొడిగించనున్నట్లు అధికారులు తెలిపారు.

ఈ ఏడాది నాలుగు గ్రహణాలు

ఐసిఎఫ్, జనవరి 13: ఈ ఏడాది నాలుగు గ్రహణాలు కనిపించనున్నట్లు అంతరిక్ష పరిశోధకులు తెలిపారు. యేటా సూర్య, చంద్ర గ్రహణాలు ఏర్పడుతుండగా, ఈ ఏడాది రెండు సూర్యగ్రహణాలు, రెండు చంద్ర గ్రహణాలు ఏర్పడనున్నాయని తెలిపారు. కొన్ని చోట్ల పాక్షికంగాను, కొన్ని చోట్ల సంపూర్ణంగాను కనిపిస్తాయని పరిశోధకులు తెలిపారు.

శ్రీరంగం ఆలయంలో సంక్రాంతి వేడుకలు

అడయార్, జనవరి 13: శ్రీరంగం రంగనాథస్వామి ఆలయంలో ఈనెల 15న సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించేలా అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. ఈ వేడుకల్లో సోమవారం ఉదయం 7 గంటలకు నంపెరుమాళ్ ఉభయ నాచ్చియార్లతో కలిసి సంక్రాంతి మండపానికి చేరుకుంటారు. ఇక్కడ వివిధ రకాలైన పూజలు నిర్వహిస్తారు. ఆ తర్వాత సాయంత్రం 4 గంటలకు బయలుదేరి సాయంత్రం 5 గంటలకు మూలస్థానానికి చేరుకుంటారు. ఆ తర్వాత 16వ తేదీన ఉదయం 10 గంటలకు నంపెరుమాళ్ అశ్వవాహనంపై విహరిస్తూ మధ్యాహ్నం 1.30 గంటలకు పార్వేటకు బయలుదేరుతారు.





ప్రభుత్వ బాలికల పాఠశాలలో విద్యార్థులకు చక్కెర పొంగలి పంపిణీ - నారాయణి ఆసుపత్రిలో పొంగల్ వేడుకలు

కోలాహలంగా పొంగల్ వేడుకలు

వేలూరు, జనవరి 13: నగరంలోని పాఠశాలలు, ఆసుపత్రులు సహా పలు ప్రాంతాల్లో శనివారం పొంగల్ వేడుకలు కోలాహలంగా జరిగాయి. సంప్రదాయ వస్త్రాలు ధరించిన విద్యార్థులు గ్రామీణ వాతావరణంలో రూపొందించిన పాఠశాల ప్రాంగణాల్లో ఉత్సాహంగా గడిపారు.

కాట్పాడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో...

కాట్పాడి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో హెచ్ఎం సరళ అధ్యక్షతన జరిగిన వేడుకల్లో ముఖ్య అతిథిగా కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సునీల్‌కుమార్, 1వ మండల కమిటీ అధ్యక్షురాలు పుష్పలతా వన్నియరాజా పాల్గొని విద్యార్థులకు చక్కెర పొంగలి అందజేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు లోకనాథన్, మహేంద్రన్, బాలాజి, నందకుమార్, జూనియర్ రెడ్‌క్రాస్ జిల్లా ఆర్గనైజర్ జనార్దనన్, పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షురాలు విమల, ఉపాధ్యక్షురాలు గౌతమి, ఉప ప్రధానోపాధ్యాయులు ఎమ్. మారిముత్తు తదితరులు పాల్గొన్నారు.

నారాయణి ఆసుపత్రిలో..

శ్రీ నారాయణి ఆసుపత్రిలో పొంగల్ వేడుకలు ఆనందోత్సహాల మధ్య జరిగాయి. వేడుకల్లో ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ బాలాజి, సినీ నటి ఆర్తీ, విదేశీ భక్తులు, ఆసుపత్రి నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్పొరేషన్ కార్యాలయంలో...

స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో పొంగల్ వేడుకలు జరిగాయి. మేయర్ సుజాత ఆనందకుమార్, డిప్యూటీ మేయర్ సునీల్‌కుమార్, మండల అధ్యక్షుడు, కౌన్సిలర్లు, ఉద్యోగులు, ప్రజలు పాల్గొని పొంగళ్లు పెట్టారు.



కార్పొరేషన్ మేయర్ సుజాత ఆనంద్‌బాబు నేతృత్వంలో పొంగల్ వేడుకలు

వేలూరు జిల్లాలో రూ.2,000 కోట్ల నష్టం

● మంత్రి దురైమురుగన్

వేలూరు, జనవరి 13: భారీ వర్షాల కారణంగా జిల్లాలో రూ.2,000 కోట్ల మేర నష్టం వాటిల్లిందని మంత్రి దురైమురుగన్ తెలిపారు. డీఎంకే జిల్లా కార్యకర్తల సమావేశం శనివారం జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్యే నందకుమార్ అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో ఎంపీ కదిర్ ఆనంద్, మంత్రి దురైమురుగన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో పలు తీర్మానాలను ఆమోదించారు. సేలంలో జరగనున్న పార్టీ యువజన మహానాడుకు భారీగా కార్యకర్తలను తరలించాలి, తుఫాను, భారీవర్షాలతో దెబ్బతిన్న 8 జిల్లాల్లో బాధిత కుటుంబాలకు తలా రూ.6,000 నగదు అందజేసిన సీఎం కృతజ్ఞతలు, రాష్ట్రం పారిశ్రామికంగా అభివృద్ధి చెందేలా ప్రపంచ పెట్టుబడిదారుల మహానాడు జరిపి రూ.6.5 లక్షల కోట్ల పెట్టుబడులు సమీకరించిన సీఎం స్టాలిన్‌కు కృతజ్ఞతలు సహా పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా మంత్రి దురైమురుగన్ మాట్లాడుతూ... ఇటీవల కురిసిన భారీవర్షాలకు జరిగిన నష్టాన్ని అంచనా వేసి రాష్ట్రప్రభుత్వానికి నివేదిక పంపించామని, నిధులు అందిన వెంటనే దెబ్బతిన్న 720 ప్రాంతాల్లో మరమ్మతులు చేపడతామని మంత్రి తెలిపారు.



సమావేశంలో పాల్గొన్న ప్రముఖులు

19న రవాణా కార్మిక సంఘాల ప్రతినిధులతో చర్చలు

ఐసిఎఫ్ జనవరి 13: రాష్ట్రప్రభుత్వ రవాణా కార్మిక సంఘాలు చేపట్టనున్న సమ్మెకు సంబంధించి ఈనెల 19వ తేది మధ్యాహ్నం 12 గంటలకు చర్చించనున్నట్లు కార్మికుల సంక్షేమ కమిషన్ తెలిపింది. వినతిపత్రాలు అందజేసిన కార్మిక సంఘాలు, రవాణా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్లు పాల్గొనాలని కమిషన్ సూచించింది.

సీఎంకు సీపీఎం నేతల కృతజ్ఞతలు

పెరంబూర్, జనవరి 13: సీపీఎం నాయకుడు షణ్ముగంకు రాష్ట్రప్రభుత్వం తరపున డాక్టర్ అంబేడ్కర్ అవార్డు ప్రదానం చేసినందుకు ముఖ్యమంత్రికి ఆ పార్టీ నేతలు కృతజ్ఞతలు తెలిపారు. సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎం స్టాలిన్‌ను సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కె.బాలకృష్ణన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.కనకరాజ్, అవార్డు గ్రహీత షణ్ముగం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా కె.బాలకృష్ణన్ మాట్లాడుతూ... 1992 అన్నాడీఎంకే హయాంలో వాచాతి గిరిజనులపై పోలీసు, అటవీ, రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బంది అని మొత్తం 269 మంది సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారన్నారు. బాధితులకు అండగా షణ్ముగం అవిశ్రాంత చట్టపోరాటం చేసి నిందితులకు శిక్షణ పడేలా చేశారని, అటువంటి వ్యక్తికి అవార్డు ప్రదానం చేసినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపామన్నారు. అలాగే, రెండు రోజుల క్రితం మదురై కార్పొరేషన్ డిప్యూటీ మేయర్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడిపై కొందరు మారణాయుధాలతో దాడులు చేశారని, ఆ ఘటనలో ఆయన తృటిలో తప్పించుకున్నారని అన్నారు. ఆయనకు ప్రాణ హాని ఉండడంతో తగిన భద్రత కల్పించాలని సీఎంను కోరినట్లు తెలిపారు. అలాగే, తుఫాను, వర్ష బాధిత జిల్లాల ప్రజలకు రూ.6,000 నగదు, పొంగల్ బహుమతిగా మరో రూ.1,000 అందజేసినందుకు కూడా సీఎంకు కృతజ్ఞతలు తెలిపామని బాలకృష్ణన్ తెలిపారు.



ముఖ్యమంత్రి స్టాలిన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కె.బాలకృష్ణన్, నేతలు కనకరాజ్, షణ్ముగం తదితరులు

అవయవదానంతో వెయ్యి మందికి ప్రాణదానం

● మంత్రి సుబ్రమణ్యం

ప్యారీస్, జనవరి 13: రాష్ట్రంలో గత సంవత్సరం 178 మంది దానం చేసిన అవయవాల ద్వారా వెయ్యి మందికి పునర్జన్మ ప్రసాదించినట్లు రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం పేర్కొన్నారు. సైదాపేట జ్యోతియమ్మాళ్ నగర్‌కు చెందిన రామ్మూర్తి (27) రెండు రోజుల క్రితం అన్నాసాలైలో నడిచి వెళుతూ ప్రమాదంలో తీవ్రగాయాలతో రాయపేట ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ వచ్చారు. అయితే ఆయన చికిత్స ఫలించక శుక్రవారం సాయంత్రం మరణించారు. ఆయన తల్లిదండ్రులు తమ కుమారుడి అవయవాలను దానం చేసేందుకు ముందుకొచ్చారు. కాలేయం, మూత్రపిండాలు, గుండె తదితరాలను రాయపేట ప్రభుత్వాసుపత్రి వైద్యులు శస్త్రచికిత్స ద్వారా తొలగించి దానంగా పొందినట్లు ప్రకటించారు. రామ్మూర్తి మృతదేహానికి మంత్రి ఎం.సుబ్రమణ్యం, ఎంపీ తమిళచ్చి తంగపాండ్యన్, ప్రభుత్వ అధికారులు సహా పలువురు అంజలి ఘటించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ... 20212లో 156 మంది అవయవదానాలు చేశారని, ఈ ఏడాది దేశంలోనే అవయవదానంలో అగ్రస్థానంలో ఉందంటూ తమిళనాడుకు కేంద్రప్రభుత్వం అవార్డు అందించిదని మంత్రి తెలిపారు.

రాష్ట్రానికి మళ్లీ వర్ష సూచన

ప్యారీస్, జనవరి 13: రాష్ట్రంలో ఆదివారం నుంచి ఈనెల 18వ తేది వరకు అక్కడక్కడా మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈశాన్య రుతుపవనాలు దక్షిణ భారత ప్రాంతాల నుంచి ఈ నెల 15వ తేదీతో నిష్క్రమించనున్నాయి. ఈ సందర్భంగా శనివారం స్థానిక నుంగంబాక్కంలోని వాతావరణ కేంద్రం ఓ ప్రకటన విడుదల చేసింది. కన్నియాకుమారి సముద్రం, చుట్టుపక్కల ప్రాంతాల్లో కొత్తగా అల్పపీడనం కేంద్రీకృతమై ఉందని, దీని ప్రభావంతో తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల్లో ఐదు రోజులు వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. కాగా, చెన్నై, శివారు ప్రాంతాల్లో రానున్న 48 గంటల వరకు ఆకాశం మేఘావృతంగా ఉంటుందని, ఉష్ణోగ్రతలు తగ్గిపోవడంతో చలి పెరిగే అవకాశముందని, తెల్లవారుజామున తేలికపాటి మంచు కురుస్తుందని ప్రకటనలో తెలిపింది.

సంక్షేమ సహాయాల పంపిణీ

వేలూరు, జనవరి 13: పుదియ నీతి కట్చి ఆధ్వర్యంలో పొంగల్ వేడుకలు శనివారం ఆ పార్టీ అధ్యక్షుడు ఏసీ షణ్ముగం అధ్యక్షతన జరిగాయి. కార్యక్రమంలో భాగంగా పలువురికి చీరలు, ధోవతులు, ఇస్త్రీ పెట్టెలు, ఆటో డ్రైవర్లకు యూనిఫాం, సత్తువాచేరి సూసై అప్పర్ చర్చికి రూ.లక్ష చెక్‌ను అందజేశారు. కరాటే రమేష్, ఇంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న పార్టీ అధ్యక్షుడు ఏసీ షణ్ముగం

సాఫ్ట్‌వేర్ సేవల్లో చెన్నైదే అగ్రస్థానం

● మంత్రి పళనివేల్ త్యాగరాజన్

ప్యారీస్, జనవరి 13: భారతదేశంలో సాఫ్ట్‌వేర్ సేవల రాజధాని నగరంగా చెన్నై మారుతోందని రాష్ట్ర సమాచార సాంకేతిక, డిజిటల్ సేవల శాఖ మంత్రి పళనివేల్ త్యాగరాజన్ పేర్కొన్నారు. అంబత్తూర్ పారిశ్రామికవాడలో రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా ఏర్పాటు చేసిన డిజిటల్ రియాలిటీ సాఫ్ట్‌వేర్ తయారీ కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చెన్నైలో అతి తక్కువ కాలంలో ప్రపంచ దేశాలు ప్రశంసించే స్థాయికి సాఫ్ట్‌వేర్ సంస్థలు అందుబాటులోకి వచ్చాయన్నారు. దేశ ఆర్థికవ్యవస్థతో పాటు అన్ని రంగాలు డిజిటల్‌మయం చేయడంలో, ఎగుమతి, సాఫ్ట్‌వేర్ సేవల్లో వేగంగా అభివృద్ధి చెందుతోందని కేంద్రప్రభుత్వమే ఇటీవల ప్రకటించిందని మంత్రి తెలిపారు.



సాఫ్ట్‌వేర్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పళనివేల్ త్యాగరాజన్

అక్రమార్జన కేసులో మాజీ మంత్రి వలర్మతి పిటిషన్ వాయిదా

ప్యారీస్, జనవరి 13: అక్రమార్జన కేసులో అన్నాడీఎంకే మాజీ మంత్రి వలర్మతి పిటిషన్‌ను ఈ నెలాఖరుకు వాయిదా వేస్తూ సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. 2001-06 మధ్య అధికారంలో కొనసాగిన అన్నాడీఎంకే ప్రభుత్వంలో ఆమె సాంఘిక సంక్షేమ శాఖ మంత్రిగా వ్యవహరించిన వలర్మతి, ఆమె కుటుంబసభ్యులకు వ్యతిరేకంగా అవినీతి నిరోధక విభాగం అధికారులు అక్రమార్జన కేసు నమోదు చేశారు. హార్బర్ నియోజకవర్గంలోని కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న ప్రత్యేక న్యాయస్థానం, అక్రమార్జన కేసు నుంచి వలర్మతి, ఆమె కుటుంబసభ్యులను విడుదల చేస్తూ 2012లో ఉత్తర్వులు జారీ చేసింది. ఈ తీర్పును పునఃపరిశీలించేలా గత సెప్టెంబరు 9వ తేది సుమోటా ముందుకు వచ్చి ఈ కేసును విచారణకు స్వీకరించిన న్యాయమూర్తి ఆనంద్ వెంకటేశ్, కేసుకు సంబంధించి వలర్మతి తదితరులు వివరణ సమర్పించాలని ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో, అక్రమార్జన కేసులో గత డిసెంబరు 4వ తేదీన వాదనలు ప్రారంభించాలని మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఈ కేసు విచారణకు స్టే విధించాలని కోరుతూ వలర్మతి తరపున దాఖలైన అప్పీలు పిటిషన్‌ను ఈ నెలాఖరులో విచారణకు స్వీకరించనున్నట్లు సుప్రీంకోర్టు పేర్కొంది.

విధి నిర్వహణలో పీజీ వైద్య విద్యార్థులకు మినహాయింపు

ఐసిఎఫ్, జనవరి 13: పీజీ వైద్యకోర్సులు ముగించిన అనంతరం రెండేళ్ల ప్రభుత్వాసుపత్రుల్లో విధులు నిర్వహించాలన్న నిర్బంధం నుంచి ప్రస్తుతం మినహాయింపు లభించింది. పీజీ కోర్సులను సర్వీస్, నాన్ సర్వీస్ క్యాడెట్లుగా విభజిస్తున్నారు. సర్వీస్ క్యాడెట్లు తాము చదివే కళాశాలలోనే పని చేస్తుండగా, నాన్ సర్వీస్ క్యాడెట్లు ఇతర ఆసుపత్రుల్లో పనిచేయాల్సి ఉంటుంది. రెండేళ్ల పాటు ఉన్న విధి నిర్వహణ కాలాన్ని ఏడాదిగా తగ్గిస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది.

ఈ యేడాది 2 వేల ఆలయాలకు కుంభాభిషేకం

● మంత్రి పీకే శేఖర్‌బాబు ప్రకటన

చెన్నై, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలోని సుమారు రెండు వేల సుప్రసిద్ధ ఆలయాలకు ఈ యేడాదిలోగా కుంభాభిషేకాలు నిర్వహించనున్నట్లు ఆ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు ప్రకటించారు. నుంగంబాక్కంలోని ఆ శాఖ కార్యాలయంలో భక్తులకు బిల్లులను సులువుగా అందజేసేలా ఆలయాల డిప్యూటీ కమిషనర్లకు స్వైపింగ్ పరికరాలను పంపిణీ చేశారు. 260 ఆలయాలకు చెందిన 315 మంది ఆలయ డిప్యూటీ, సహాయ కమిషనర్లు ఈ పరికరాలను అందుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి శేఖర్‌బాబు మాట్లాడుతూ... డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే ఆలయాలన్నీ కొత్త రూపును సంతరించుకున్నాయని, కబ్జాలకు గురైన కోట్లాది రూపాయల ఆలయ భూములను స్వాధీనం చేసుకున్నామన్నారు. యేళ్ల తరబడి నిరుపయోగంగా ఉన్న బంగారాన్ని బ్యాంకుల్లో డిపాజిట్ చేసి ఆలయాలకు ఆర్థిక పరిపుష్టిని కలిగించామని తెలిపారు. మూడేళ్లలో 1224 ఆలయాలకు కుంభాభిషేకాలను నిర్వహించామన్నారు. ఈ నెలాఖరులోగా 40 ఆలయాలకు కుంభాభిషేకాలు జరుపనున్నామని చెప్పారు. ఆలయాల్లో భక్తులు దర్శనానికి, ఇతర సేవలకు కౌంటర్ల వద్ద క్యూలో గంటల తరబడి వేచి ఉండే ఇబ్బందులు తప్పించడానికే స్వైపింగ్ పరికరాలను ఆలయ డిప్యూటీ కమిషనర్లకు పంపిణీ చేశామన్నారు.

కిళంబాక్కం నుంచే అన్ని బస్సులు... : ప్రస్తుతం కోయంబేడు బస్‌స్టేషన్ నుంచి వెళ్లే అన్ని ఎక్స్‌ప్రెస్ బస్సులను ఇకపై కిళంబాక్కం బస్‌స్టేషన్ నుంచే నడిపేందుకు ప్రభుత్వం తగు చర్యలు చేపడుతోందని ఆయన చెప్పారు.



నుంగంబాక్కంలోని దేవాదాయ శాఖ కార్యాలయంలో ఆలయ అధికారికి స్వైపింగ్ పరికరాన్ని అందిస్తున్న శేఖర్‌బాబు



టి.నగర్ టీటీడీ ఆలయంలో శ్రీ రామజన్మభూమి క్షేత్ర ప్రాణ ప్రతిష్ఠ వేడుకల్లో శనివారం సాయంత్రం గాత్ర కచేరీ చేసిన శైలేష్ జోస్యుల బృందం, వయొలిన్ వాద్య కచేరి నిర్వహించిన ఎ.కన్యాకుమారిని సత్కరిస్తున్న స్థానిక సలహామండలి సభ్యులు మోహన్‌రావు, పీవీఆర్ కృష్ణారావు తదితరులు

జల్లికట్టు పోటీలకు సిద్ధమైన మదురై

అడయార్, జనవరి 13: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నిర్వహించే సాహస క్రీడ జల్లికట్టు పోటీలకు మదురై జిల్లా సిద్ధమైంది. ఈనెల 15న అవనియాపురంలో, 16న పాలమేడు, 17వ తేదీన అలంగానల్లూరుల్లో ఈ పోటీలు జరుగుతాయి. అవనియాపురంలో జరిగే పోటీల కోసం మొత్తం 2400 ఎద్దులు, 1218 మంది సాహస వీరులను సిద్ధంగా ఉన్నారు. అలంగానల్లూరు పోటీల కోసం 6099 ఎద్దులు, 1784 మంది క్రీడాకారులు, పాలమేడు జల్లికట్టుకు 3677 ఎద్దులు, 1412 మంది క్రీడాకారులను సిద్ధం చేశారు. ఈ పోటీల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జిల్లా యంత్రాంగంతో పాటు పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు.

పుళల్ గోదాములో భారీ అగ్ని ప్రమాదం

● ఎలక్ట్రానిక్స్ పరికరాల దగ్ధం

చెన్నై, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతమైన పుళల్‌లో ప్రైవేటు గోదాములో శనివారం వేకువజాము జరిగిన భారీ అగ్ని ప్రమాదంలో కోట్లాది రూపాయల విలువైన కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు తదితర ఎలక్ట్రానిక్స్ వస్తువులు కాలిబూడిదయ్యాయి. పుళల్- అంబత్తూరు రహదారిలో నంగనల్లూరుకు చెందిన అనంత కృష్ణన్ ప్రైవేటు గోదామును నడుపుతున్నారు. 80 వేల అడుగుల విస్తీర్ణం కలిగిన ఆ గోదాములో ఐదేళ్లుగా విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న ఎలక్ట్రానిక్స్ పరికరాలను దింపుకుని రాష్ట్రవ్యాప్తంగా సరఫరా చేసేవారు. ఈ నేపథ్యంలో శుక్రవారం అర్ధరాత్రి ఉన్నట్టుండి ఆ గోదాము నుంచి దట్టమైన పొగలు వెలువడ్డాయి. కాసేపటికల్లా ఆ గోదాముకు అన్ని వైపులా మంటలు వ్యాపించాయి. దీంతో గోదాములో భద్రపరిచిన ఎలక్ట్రానిక్స్ వస్తువులకు కూడా మంటలు వ్యాపించాయి. ఈ సమాచారం అందుకున్న అగ్నిమాపక దళం అధికారులు రెడ్‌హిల్స్, మాధవరం, మనలి, బ్రాడ్వే, సెంబియం, అంబత్తూరు, విల్లివాక్కం తదితర ప్రాంతాల నుండి 11 ఫైరింజన్లతో వెళ్లి మంటలను పోరాడి ఆర్పివేశారు. పుళల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక దళం సభ్యులు

రూ.2 కోట్ల విలువైన గంజాయి స్వాధీనం

అడయార్, జనవరి 13: సేలం మీదుగా కేరళ రాష్ట్రానికి వెళుతున్న రైలులో రూ.2 కోట్ల విలువైన గంజాయిని రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి వెస్ట్ బెంగాల్ రాష్ట్రానికి చెందిన దీపక్‌శెట్టి (31)ని అరెస్టు చేశారు. టాటానగర్ నుంచి సేలం మీదుగా ఎర్నాకుళం వెళ్లే ఎక్స్‌ప్రెస్‌లో గంజాయి స్మగ్లింగ్ జరుగుతున్నట్లు సేలం అక్రమ మాదకద్రవ్య నిరోధక విభాగం పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో పోలీసులు రైలులో తనిఖీలు చేసి ఏసీ బోగీ అసిస్టెంట్ వద్ద గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

మద్యం బాటిల్‌లో పురుగు

రూ.35 వేల పరిహారం చెల్లించండి ● వినియోగదారుల ఫోరం

అడయార్, జనవరి 13: క్వార్టర్ మద్యం బాటిల్‌లో పురుగు కనిపించడంతో రూ.35 వేల పరిహారం చెల్లించాలని వినియోగదారుల ఫోరం ఆదేశించింది. తెన్‌కాశి జిల్లా శంకరన్ కోయిల్‌కు చెందిన మారికన్నన్ విరుదునగర్‌లో టైలర్‌షాపు నడుపుతున్నాడు. 2021 సెప్టెంబరు 9న స్థానిక మద్యం షాపులో మద్యం తాగేందుకు వెళ్లి క్వార్టర్ బాటిల్ కొనుగోలు చేయగా, అందులో పురుగు కనిపించింది. దీనిపై ఆయన శ్రీవిల్లిపుత్తూరులో ఉన్న వినియోగదారుల ఫోరంలో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై పలు దఫాలుగా విచారణ జరిపిన కోర్టు... వినియోగదారుడికి రూ.35 వేల నష్ట పరిహారం చెల్లించాలని ఆదేశించింది.

సంక్రాంతి వేడుకల్లో చిందేసిన జిల్లా కలెక్టర్

అడయార్, జనవరి 13: కోయంబత్తూరులో జరిగిన సంక్రాంతి వేడుకల్లో జిల్లా కలెక్టర్ క్రాంతికుమార్ సిబ్బందితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అందరితో కలిసి డ్యాన్స్ చేస్తూ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పంచె, చొక్కా ధరించి తన కార్యాలయ సిబ్బందితో కలిసి పాల్గొన్నారు. ఆ తర్వాత వారంతా కలిసి పొంగల్ వేడుకల్లో భాగంగా వివిధ నృత్యాలు చేయగా, కలెక్టర్ కూడా పాల్గొని, వారితో కలిసి కాలు కదిపారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బందికి సంక్రాంతి కానుకలు అందజేశారు.

కాలుష్యరహిత భోగి జరుపుకుందాం

పెరంబూర్, జనవరి 13: కాలుష్య రహిత భోగిని జరుపుకుందామని పసుమై తాయగం ప్రజలకు విజ్ఞప్తి చేసింది. తై పొంగల్ సందర్భంగా చెంగల్పట్టు జిల్లా చెల్లిపుణ్యంలో ఈ సంస్థ ఆధ్వర్యంలో ప్రజలకు పర్యావరణంపై అవగాహన కల్పించారు.ముఖ్యఅతిథిగా సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కన్నన్, పర్యావరణ పరిరక్షణ గురించి వివరించారు. ఈ సందర్భంగా చిన్నారులకు మొక్కలు అందజేశారు. తిరుకసూర్ సెందిల్‌నాధన్, అముద గుణశేఖరన్, లయన్ ఎం.అన్నామలై, గురు పాల్గొన్నారు.



పిల్లలకు మొక్కలు పంపిణీ చేస్తున్న కన్నన్



శనివారం చెన్నై సచివాలయంలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్న ప్రభుత్వ అడ్వొకేట్ జనరల్ పీఎస్ రామన్



వండలూరు సమీపం ఊరపాక్కం రేషన్‌షాపులో బియ్యంకార్డుదారులకు పొంగల్ కానుకలను పంపిణీ చేస్తున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా



మండల పూజ, మకర విళక్కును పురస్కరించుకుని రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి దంపతులు శనివారం చెన్నై మహాలింగాపురంలో వున్న అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రత్యేకలు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

హెయిర్‌స్టైలిస్ట్ జీవిత కష్టాలను తెలిపే 'సింగపూర్ సెలూన్'

● 25న విడుదల



విలేకరుల సమావేశంలో ఆర్జేబాలాజీ, ఐసరి కె.గణేష్, గోకుల్

హీరో ఆర్‌జే బాలాజీ - దర్శకుడు గోకుల్ కాంబినేషన్‌లో తెరకెక్కిన చిత్రమే 'సింగపూర్ సెలూన్'. ఒక హెయిర్ స్టైలిస్ట్ జీవితమే ఈ చిత్ర కథ అని దర్శకుడు గోకుల్ అన్నారు. ఈనెల 25న విడుదలకానుంది. ఈ నేపథ్యంలో శనివారం హీరో ఆర్జే బాలాజీ, దర్శకుడు గోకుల్, నిర్మాత్ డాక్టర్ ఐసరి కె.గణేష్‌లు విలేకరులతో మాట్లాడారు. దర్శకుడు గోకుల్ మాట్లాడుతూ... 'ఇప్పటివరకు నేను రూపొందించిన చిత్రాల్లో ఇది నాకు ఉత్తమ చిత్రంగా ఉంటుంది. నేను చూసిన బార్బర్లు, వారి సమస్యలు, వారి స్టైల్ ఇలా ప్రతి అంశాన్ని ఇందులో చూపించాం. తొలి భాగం కామెడీగా సాగుతుంది. రెండో భాగంలో హాస్యంతో పాటు సెంటిమెంట్, సందేశం ఉంటాయి. ముఖ్య హీరో ఇందులో అతిథి పాత్రను పోషించారు. ఆ విషయాన్ని మాత్రం సస్పెన్స్‌గా ఉంచాం' అని అన్నారు. హీరో ఆర్జే బాలాజీ మాట్లాడుతూ... 'సాధారణంగా ప్రతి ఒక్కరికీ ఒక్కో జీవిత లక్ష్యం ఉంటుంది. అలా ఈ చిత్ర హీరోకు హెయిర్ స్టైలిస్ట్ కావాలన్నదే లక్ష్యం. ఇందుకోసం అతను ఎదుర్కొన్న సమస్యలు, లక్ష్యానికి చేరుకున్నాడా? అన్నదే ఈ చిత్ర కథ. ఇప్పటివరకు నా దర్శకత్వంలోనే హీరోగా నటిస్తూ వచ్చాను. ఇపుడు ఇతర డైరెక్టర్ల దర్శకత్వంలో నటిస్తున్నాను. నాలో నేను చూపించలేకపోయిన కోణాన్ని వారు చూపిస్తున్నారు. వేల్స్ బ్యానరులో 2019లో ఎల్‌కేజీ, 2020లో 'మూక్కుత్తి అమ్మన్' చిత్రాల్లో నటించా. ఇపుడు ఈ బ్యానరులో నాకు మూడో చిత్రం. సీనియర్ నటులు సత్యరాజ్, లాల్, రోబో శంకర్, మీనాక్షి చౌదరి, కిషేన్‌దాస్‌తో తదితరులు నటించారు. వివేక్‌మెర్విన్ సంగీతం అందించగా, ఎం.సుకుమార్ సినిమాటోగ్రఫీ సమకూర్చారు. దర్శకుడు లోకేష్ కనకరాజ్, హీరో జీవి కేమియో పాత్రల్లో కనిస్తారని పేర్కొన్నారు. నిర్మాత డాక్టర్ ఐసరి కె.గణేష్ మాట్లాడుతూ... 'వేల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ బ్యానరుపై ఇప్పటివరకు వచ్చిన చిత్రాలకంటే పెద్ద బడ్జెట్‌తో నిర్మించాం. దీనికి కారణం కథపై ఉన్న నమ్మకం. కచ్చితంగా విజయం సాధిస్తుందన్న నమ్మకం ఉంది' అని పేర్కొన్నారు.

'అయలాన్' రెండో భాగం వస్తుంది

● హీరో శివకార్తికేయన్



చిత్రజ్యోతి

తాను హీరోగా నటించి సంక్రాంతి పండుగకు విడుదలై సూపర్‌హిట్ టాక్‌ను సొంతం చేసుకున్న 'అయలాన్' చిత్రానికి సీక్వెల్ ఉంటుందని హీరో శివకార్తికేయన్ అన్నారు. ఈసందరకభంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ.... 'అయలాన్' చిత్రానికి సూపర్‌హిట్ టాక్ రావడం సంతోషంగా ఉంది. అగ్రహీరోలు కమలహాసన్, రజనీకాంత్, సీనియర్ నటుడు గౌండమణిలతో కలిసి నటించాలన్న కోరిక ఉంది. ప్రస్తుతం కమల హాసన్ నిర్మిస్తున్న చిత్రం 80 శాతం మేరకు షూటింగ్ పూర్తయింది. అలాగే, ఏఆర్ మురుగదాస్ దర్శకత్వంలో నటించనున్నా. ఇందులో ఆర్మీ అధికారి పాత్రను పోషిస్తున్నా. రాజ్‌కమల్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ బ్యానరుపై నిర్మించే చిత్రంలో కమల్ పాత్ర ఏదో రూపంలో ఉండాలని కోరుకుంటున్నాను. ఇందుకోసం గట్టిగా ప్రయత్నిస్తాం. గతంలో నేను నటించిన 'రజనీ మురుగన్' చిత్రానికి 'అయలాన్' చిత్రానికి అనేక పోలికలు ఉన్నాయి. కొన్ని సమస్యల కారణంగా విడుదల ఆలస్యమైంది. చివరికి సంక్రాంతికి రిలీజ్ చేయగా, విజయం సాధించింది. 'రజనీ మురుగన్' చిత్రానికి రెమ్యునరేషన్ తీసుకోలేదు. ఇపుడు 'అయలాన్'కు ఇదే తరహా పరిస్థితులను ఎదుర్కొన్నాం' అని పేర్కొన్నారు.

గ్లోబ్ నెక్సస్ ఆధ్వర్యంలో 'టాలెంట్ హంట్ షో'



'టాలెంట్ హంట్ షో' లోగో ఆవిష్కరణ దృశ్యం

సోషల్ మీడియా పుణ్యమాని అనేక రకాలైన ప్రతిభాపాటవాలు వెలుగులోకి వస్తున్నాయి. సోషల్ మీడియా వేదికగా యువత పోస్ట్ చేసే యువతీయువకులకు సరైన అవకాశం కల్పించేందుకు వీలుగా గ్లోబ్ నెక్సస్ ఆధ్వర్యంలో 'నీంగలుం మిన్నలాం నట్చత్తిర మాయ్' పేరుతో 'టాలెంట్ హంట్ షో'ను ప్రారంభించింది. నటన, సంగీతం, నృత్య రంగాలపై ఆసక్తి ఉన్నవారు ఈ షోలో పాల్గొని తమ ప్రతిభను నిరూపించుకోవచ్చు. ఈ టాలెంట్ హంట్ షోలో విజేతలకు నగదు బహుమతిని అందజేస్తారు. ఇందుకోసం తమ ప్రతిభను వ్యక్తపరుస్తూ 30 సెకన్ల నిడివితో ఒక వీడియోను పంపించాల్సి ఉంటుంది. ఇందులో వ్యక్తిగత నృత్యాలతో పాటు గ్రూపు డ్యాన్స్‌లకు సంబంధించిన షాట్స్ కూడా అప్‌లోడ్ చేయొచ్చు. గ్రూపు డ్యాన్స్‌లో మాత్రం ముగ్గురి నుంచి ఐదుగురు మాత్రమే ఉండాలి. ఇందులో విజేతలుగా నిలిచేవారికి నగదు బహుమతి ఇవ్వడమేకాకుండా, సినిమాల్లో అవకాశం కల్పిస్తారు. ఈ టాలెంట్ హంట్ షో ద్వారా ప్రముఖ జానపద సంగీత కళాకారుడు ఆంథోనీ దాసన్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. చైల్డ్ ఆర్టిస్ట్, టీన్ ఆర్టిస్ట్, సీనియర్ ఆర్టిస్ట్, సింగర్, కమెడియన్, సోలో డ్యాన్స్, టీమ్ డ్యాన్స్ విభాగాల్లో తమ ప్రతిభను నిరూపించుకోవచ్చు. విజేతలుగా నిలిచేవారికి మొదటి బహుమతిగా రూ.5 లక్షలు, రెండో బహుమతిగా రూ.3 లక్షలు, మూడో బహుమతిగా రూ.2 లక్షలు, నాలుగో బహుమతిగా రూ.లక్ష చొప్పున అందజేస్తారు.

నడిగర్ సంఘం ఆధ్వర్యంలో పొంగల్ కానుకల పంపిణీ



పొంగల్ కానుకల పంపిణీలో నటుడు నాజర్

దక్షిణ భారత నటీనటుల సంఘమైన నడిగర్ సంఘం ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు శనివారం జరిగాయి. ఈ వేడుకల్లో భాగంగా నడిగర్ సంఘం తరపున 2500 మందికి పొంగల్ కానుకలు పంపిణీ చేశారు. నడిగర్ సంఘం అధ్యక్షుడు, సీనియర్ నటుడు నాజర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు. చీర, ధోవతి, చెరకు, స్వీట్లు ఇలా వివిధ రకాలైన సామగ్రిని అందజేసి, ప్రతి ఒక్కరికీ ఆయన సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. మరోవైపు ఈనెల 19న నడిగర్ సంఘం ఆధ్వర్యంలో ఇటీవల మృతి చెందిన సీనియర్ నటుడు కెప్టెన్ విజయకాంత్‌కు సంస్మరణ సభ జరగనుంది. స్థానిక తేనాంపేటలోని కామరాజర్ అరంగంలో జరిగే ఈ సంస్మరణ కార్యక్రమంలో కోలీవుడ్ ఇండస్ట్రీకి చెందిన ప్రముఖులంతా హాజరై, కెప్టెన్‌తో తమకున్న అనుబంధాన్ని నెమరువేసుకోనున్నారు.

సొంతూళ్లకు... రయ్... రయ్

● రెండు రోజుల్లో 10 లక్షల మందికి పైగా ప్రయాణం
● కిటకిటలాడిన జాతీయ రహదారులు
● మార్కెట్లలో రెండవ రోజూ తరగని రద్దీ



కోయంబేడు హైవేలో స్తంభించిన ట్రాఫిక్

ప్యారీస్, జనవరి 13: సంక్రాంతి పండుగను కుటుంబసభ్యులు, బంధువులతో కలసి సోమవారం జరుపుకొనేందుకు నగరాల్లో వృత్తిరీత్యా స్థిరపడిన ప్రజలు సొంతూళ్లకు పయనమవుతున్నారు. రాష్ట్ర రవాణా సంస్థలు నడిపే బస్సులు, రైళ్లు, కార్లు, పర్యాటక వాహనాలు, విమానాల్లో తరలివెళ్తున్నారు. శుక్రవారం మాత్రమే సుమారు 5 లక్షల మందికి పైగా సొంతూళ్లకు ప్రజలు బయల్దేరిన వాహనాల వల్ల జాతీయ రహదారుల్లో ట్రాఫిక్ రద్దీ కనిపించింది. చెన్నైలో తూత్తుకుడి, కన్నియాకుమారి, తిరునల్వేలి, విరుదునగర్, మదురై, రామనాథపురం తదితర దక్షిణాది జిల్లాలకు చెందిన వారు లక్షలాది మంది నివసిస్తున్నారు. కోవై, మదురై, తిరుప్పూర్ నగరాలతో పాటు పలు ప్రాంతాల్లో వలస కార్మికులు ఉన్నారు. ప్రైవేటు వర్శిటీలు, కళాశాలల్లో డిగ్రీ కోర్సులు చదువుకుంటున్న విద్యార్థులు సైతం శుక్రవారం సాయంత్రం నుంచే తమ సొంత ఊర్లకు పయనమవుతున్నారు. పండుగ రద్దీని దృష్టిలో ఉంచుకొని సుమారు 70 శాతం మంది ప్రజలు గత నాలుగు నెలలకు ముందే రైళ్లు, బస్సుల్లో టిక్కెట్లు రిజర్వ్ చేసుకున్నారు. ఇక, మిగిలిన వారు ఛార్జీల మోత గురించి ఆలోచించకుండా పిల్లాపాపలతో కలసి తరలి వెళ్తున్నారు. దీంతో చెన్నై నుంచి కన్నియాకుమారి వరకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని జిల్లాల్లో రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్, ఎగ్మూర్, తాంబరం, పెరంబూర్ తదితర రైల్వేస్టేషన్లలో ఊళ్లకు వెళ్లే వారి సంఖ్య విపరీతంగా పెరిగింది. బరనూర్ టోల్‌గేట్ దాటేందుకు శుక్రవారం రాత్రి 9 నుంచి అర్ధరాత్రి 2 గంటల వరకు సమయం పట్టిందని, ఇలాంటి పరిస్థితే జాతీయ రహదారుల్లో కూడా నెలకొందని ట్రాఫిక్ విభాగం పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా, ఈ ఏడాది సంక్రాంతికి రాష్ట్రవ్యాప్తంగా 19,484 బస్సులను ప్రభుత్వ రవాణా సంస్థలు నడుపుతున్నాయి. ఒక్క చెన్నై నుంచి రోజు నడిపే 2,100 బస్సులతో పాటు పండుగ రద్దీని దృష్టిలో ఉంచుకొని 1,260 ప్రత్యేక బస్సులు దూరప్రాంతాలకు నడిపాయి.

మార్కెట్లలో తరగని రద్దీ...

పెద్ద పండుగను పురస్కరించుకొని గత కొన్ని రోజులుగా నగరం, శివారు ప్రాంతాల్లో ఉన్న వస్త్ర దుకాణాల్లో కొనుగోలుదారులు రద్దీ కనిపిస్తోంది. టి.నగర్, పురుషవాక్కం తదితర ప్రాంతాలకు పోటెత్తారు. చెరుకు గడలు, పసుపు కొమ్ముల విక్రయాలు జోరుగా సాగాయి. కోయంబేడు హోల్‌సేల్ మార్కెట్‌లో 15 చెరకుగడలను రూ.450 నుంచి రూ.500 వరకు విక్రయిస్తున్నారు. అదే విధంగా పసుపు కొమ్ములు గుత్తి రూ.120కి, అరటి గెలలు, మట్టి కుండలు, అరిటాకులు, మామిడాకులు, తోరణాలు, పండ్లు ఫలాలు కొనుగోలు చేస్తున్న వారితో మార్కెట్లు కళకళలాడుతున్నాయి.



కొత్త కుండలు కొనుగోలు చేస్తున్న మహిళలు



విక్రయానికి సిద్ధంగా తోరణాలు



కోయంబేడు హోల్‌సేల్ మార్కెట్లో అరటి గెలలు



టి.నగర్ రంగనాథన్ వీధిలో కొనుగోలుదారుల రద్దీ



సెంట్రల్ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ



కోయంబేడు బస్ టెర్మినల్‌లో ప్రయాణికుల రద్దీ



లారీల నుంచి దించుతున్న చెరకు గడలు



పసుపు కొమ్ములు కొనుగోలు చేస్తున్న ప్రజలు



చెన్నై సచివాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్ నుండి అవార్డులు స్వీకరించిన ప్రముఖులు

సేవాపరులకు అవార్డుల ప్రదానం

చెన్నై, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర తమిళభాషాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో తమిళ భాష, సాహిత్యానికి విశిష్ట సేవలందించిన ప్రముఖులకు ముఖ్యమంత్రి స్టాలిన్ శనివారం సాయంత్రం అవార్డులు ప్రదానం చేశారు. 2024 సంవత్సరానికి తిరువళ్లువర్ అవార్డును వేలూరు రత్నగిరి మురుగన్ ఆలయ నిర్వాహకుడు బాలమురుగన్ అడిమై స్వామికి, అన్నా అవార్డును పత్తమడై పరమశివంకు, కామరాజర్ అవార్డును వి.బలరామన్‌కు అందించారు. భారతియార్ అవార్డును కవి పళనిభారతి, భారతిదాసన్ అవార్డును కవి ఎం.ముత్తరసు, తిరువిక అవార్డును ప్రొఫెసర్ ఎస్ జయశీల స్టీఫెన్, కీఆపా విశ్వనాథం అవార్డును ఇరా కరుణానిధి అందుకున్నారు. 2023 సంవత్సరానికిగాను పెరియార్ అవార్డును శుభ వీరపాండ్యన్‌కు, అంబేడ్కర్ అవార్డును పి.షణ్ముగంకు ప్రదానం చేశారు. తమిళభాషాభివృద్ధి, సమాచార శాఖ మంత్రి సామినాథన్, దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు, ఆదిద్రావిడుల సంక్షేమ శాఖ మంత్రి ఎన్. కయళ్‌విళి సెల్వరాజ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా, తమిళభాషాభివృద్ధి కార్యదర్శి డాక్టర్ ఇరా సెల్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య రామయ్య ప్రసాదం పంపిణీ



మురళికి ప్రసాదం అందిస్తున్న ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ నిర్వాహకులు

ప్యారీస్, జనవరి 13: అయోధ్య రామయ్య ప్రసాదం, అక్షతలను రాష్ట్రీయ సేవా సంఘం, విశ్వ హిందూ పరిషత్ కార్యకర్తలు రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటికీ పంచి పెడుతున్నారు. ఆ సంస్థల వలంటీరు, ప్రముఖ వ్యాపారవేత్త జి.వెంగయ్య శ్రీ రామచంద్రుడి ఫొటో, అయోధ్య రామాలయం ఫొటో, అక్షతలు, ప్రసాదాన్ని స్థానిక రెడ్‌హిల్స్, పుళల్, కావాంగరై ప్రాంతాల్లో సుమారు 3,000 మందికి పంపిణీ చేయాలంటూ పుళల్ కావాంగరై తెలుగు ప్రజల సంక్షేమ సంఘం అధ్యక్షులు లయన్ జి.మురళికి శనివారం అందజేశారు. ముందుగా ఈ నెల 22న అయోధ్య క్షేత్రంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న రామాలయ ప్రాణప్రతిష్ఠ విజయవంతం కావాలంటూ సీతారామలక్ష్మణ ఆంజనేయ స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాళిరాజ్, ఉలగరాజన్, రామమూర్తి, ముఖేష్, బి.కృష్ణయ్య, బి.దామోదరం, బి.మురళి, పి.నరసింహారావు, ఎస్.నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● పండుగ సెలవుల ఎఫెక్ట్

విపరీతంగా పెరిగిన విమాన ఛార్జీలు

చెన్నై, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి వరుస సెలవుల కారణంగా బస్సులు, రైళ్లలో రిజర్వేషన్లు పూర్తి కావటంతో దక్షిణాది నగరాలకు వెళ్లే ప్రయాణికులు విమాన ప్రయాణంపై దృష్టి సారిస్తున్నారు. అదే అదనుగా ప్రైవేటు విమాన సంస్థలు ఛార్జీలను విపరీతంగా పెంచాయి. ప్రస్తుతం మీనంబాక్కం జాతీయ విమానాశ్రయంలో తూత్తుకుడి, మదురై, తిరుచ్చి, కోయంబత్తూరు, సేలం నగరాలకు వెళ్లే ప్రయాణికులు విమానాల్లో టికెట్లు లభించక ఇబ్బందులు పడుతున్నారు. రెండు రోజులుగా ఈ నగరాలకు వెళ్లే విమానాలన్నీ నిండిపోయాయి. దీంతో ప్రైవేటు సంస్థ విమానాలు ఉన్నట్టుండి ఛార్జీలను పెంచి వసూళ్లవేట సాగిస్తున్నాయి. చెన్నై నుంచి తూత్తుకుడికి విమానంలో వెళ్లేందుకు ఇప్పటిదాకా రూ.3624ను ఛార్జీగా వసూలు చేసేవారు. ఈ విమానఛార్జీని శనివారం ఉదయం నుంచి రూ.13,639కి పెంచారు. ఇదే విధంగా మదురైకి విమానఛార్జీని రూ.3367ల నుంచి రూ.17,262కు పెంచారు. కోయంబత్తూరుకు రూ.2215ల నుంచి రూ.14689కి పెంచారు. చెన్నై నుంచి సేలం వెళ్లేందుకు ఇదివరకు రూ.2,290ను వసూలు చేసేవారు. ప్రస్తుతం ఆ ఛార్జి ఊహించని విధంగా రూ.11,329కి పెంచారు. పండుగ సీజన్‌లో దక్షిణాది నగరాలకు అదనంగా విమాన సర్వీసులు నడిపితే ఇలా విపరీతంగా ఛార్జీలు పెరిగేది కావని ప్రయాణికులు చెబుతున్నారు.

చెన్నై పోలీసు శాఖ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు





పొంగలి వండుతున్న పోలీసు కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్, ఆయన సతీమణి శిల్పం కుమార్ - విజేతలకు బహుమతులు అందిస్తున్న కమిషనర్ సందీప్ రాయ్ రాథోడ్

చెన్నై, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనరేట్‌లో శనివారం ఉదయం సంక్రాంతి సంబరాలు వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో పోలీసు కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్, ఆయన సతీమణి శిల్పం కపూర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సెంట్రల్ క్రైం విభాగం పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో పోలీసు అధికారులు కుటుంబ సభ్యులతో కలిసి సంప్రదాయ దుస్తులు ధరించి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఆ తర్వాత ఎగ్మూరు రాజరత్నినం స్టేడియంలో సాయుధ దళం ఆధ్వర్యంలో జరిగిన పొంగల్ వేడుకల్లో పోలీసు కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్ సతీసమేతంగా పాల్గొన్నారు. గ్రామీణ వాతావరణాన్ని తలపించేలా కుండల తయారీ, చిలుక జోస్యం, చెరకు రసం దుకాణం, పశువుల పాక తదితర సెట్టింగులు ఆకట్టుకున్నాయి. ఆ తర్వాత ముగ్గుల పోటీలు, టగ్ ఆఫ్‌వార్ పోటీలు, ఉట్టికొట్టడం, లక్కీ కార్నర్, డ్యాన్స్ పోటీ, చిన్నారులకు పరుగు పందేలు నిర్వహించారు. విజేతలకు సందీప్‌రాయ్ రాథోడ్ బహుమతులను పంపిణీ చేశారు..

యూట్యూబర్‌పై పరువు నష్టం దావా

● అప్సరకు రూ.50లక్షల పరిహారం



చెన్నై, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ మోడల్, హిజ్రా అప్సర ఓ యూట్యూబర్‌పై దాఖలు చేసిన పరువు నష్టం దావా కేసులో రూ.50లక్షలను పరిహారంగా చెల్లించేలా ఆదేశిస్తూ మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. చెన్నైకి చెందిన హిజ్రా అప్సర లండన్‌లో విద్యాభ్యాసం చేసి 2016లో బీజేపీలో, తర్వాత కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. కాంగ్రెస్‌ను విడిచి చివరకు అన్నాడీఎంకేలో చేరి ఆ పార్టీ అధికార ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారు. ఆ నేపథ్యంలో అప్సరను కించపరిచేలా చెన్నైకి చెందిన జో మైఖేల్ ప్రవీణ్ అనే యూట్యూబర్ 10 రకాల వీడియోలు వెలువరించారు. దీంతో తన కీర్తిప్రతిష్ఠలకు భంగం కలిగించేలా వీడియోలు వెలువరించిన ప్రవీణ్ పరిహారంగా రూ.1.25 కోట్లను చెల్లించేలా ఉత్తర్వులివ్వాలని కోరుతూ మద్రాసు హైకోర్టులో పరువు నష్టం దావా వేశారు. ఈ దావాపై విచారణ జరిపిన హైకోర్టు అప్సరకు రూ.50లక్షలను పరిహారంగా చెల్లించేలా ఉత్తర్వు జారీ చేస్తూ తీర్పు వెలువరించింది.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

● రాష్ట్రప్రభుత్వ అదనపు కార్యదర్శి జీసీ నాగూర్



జీసీ నాగూర్, డాక్టర్ కొల్లి రాజుల సన్మాన సభలో టామ్స్ నిర్వాహకులు

ప్యారీస్, జనవరి 13: విద్యతోనే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని భారత రాజ్యాంగ నిర్మాణ శిల్పి అంబేడ్కర్ నిరూపించారని, ఆయనలాగే ఆదిఆంధ్రులు, అరుంధతీయులు ఉన్నతవంతులు కావాలని రాష్ట్రప్రభుత్వ అదనపు కార్యదర్శి జీసీ నాగూర్ సూచించారు. తమిళనాడు విద్యుత్ బోర్డులో లీగల్ అడ్వైజర్‌గా వ్యవహరించిన జీసీ నాగూర్‌ను రాష్ట్రప్రభుత్వం అదనపు కార్యదర్శిగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా తమిళనాడు ఆది ఆంధ్ర అరుంధతీయ మహాసభ(టామ్స్) ఆధ్వర్యంలో అధ్యక్షుడు నేలటూరు విజయ్‌కుమార్ సారథ్యంలో శనివారం నుంగంబాక్కంలోని కార్యాలయంలో అభినందన సభ నిర్వహించారు. టామ్స్ వ్యవస్థాపకుడు, జనోదయం సాంఘిక విద్యాసంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ గొల్లపల్లి ఇశ్రాయేలు ఆహ్వానం పలికిన ఈ సభలో నగరంలోని పలు ఆదిఆంధ్రులు, అరుంధతీయ, మాస్ సంఘాల నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జీసీ నాగూర్‌ను దుశ్శాలువలతో కప్పి, పూల మాలలతో సత్కరించారు. అదే విధంగా శనివారం 63వ వసంతంలోకి అడుగు పెట్టిన ప్రముఖ శాస్త్రవేత్త, 'మాస్' అధ్యక్షుడు డాక్టర్ కొల్లి రాజు జన్మదినాన్ని కేక్ కట్ చేసి జరుపుకున్నారు. ఈ వేదిక ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలందరికి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.

పొల్లాచ్చిలో బెలూన్ల పండుగ ప్రారంభం



ఎగిరేందుకు సిద్ధమవుతున్న వింత ఆకారాల బెలూన్లు

చెన్నై, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు జిల్లా పొల్లాచ్చిలో తొమ్మిదో అంతర్జాతీయ బెలూన్ల పండుగ ప్రారంభమైంది. రాష్ట్ర పర్యాటక అభివృద్ధి శాఖ ప్రైవేటు సంస్థతో కలిసి ఈ పండుగను నిర్వహిస్తోంది. ఈ పండుగలో దేశవిదేశాల నుంచి అతి పెద్ద గ్యాస్ బెలూన్లు ఎగురవేశారు. రాష్ట్రం నలమూలల నుంచి పర్యాటకులు పెద్ద సంఖ్యలో విచ్చేశారు. పొల్లాచ్చి సమీపం అచ్చిపట్టిలో బెలూన్లను ఎగురవేశారు. ఫ్రాన్స్, నెదర్లాండ్, స్పెయిన్, జపాన్, థాయ్‌లాండ్, వియత్నాం సహా ఎనిమిది దేశాల నుంచి 11 బెలూన్లను తెప్పించారు. శనివారం ఉదయం ఆ బెలూన్లలో వేడి గ్యాస్‌ను నింపి ప్రత్యేకమైన పైలెట్ల ద్వారా వాటి ఎగురవేశారు. ఆ బెలూన్లు కొన్ని కిలోమీటర్ల దూరం వరకూ ఎగురుతూ వెళ్ళాయి ఈ బెలూన్లలో ప్రజలను కూడా అనుమతిస్తున్నారు. ఈ బెలూన్లపై పొల్లాచ్చి నగరపు అందాలను ఐదు వందల అడుగుల ఎత్తు నుంచి వీక్షించే అవకాశం ఉంది. బెలూన్లలో విహరించేందుకు ఒక్కో వ్యక్తికి రూ.1500ను ఛార్జిగా వసూలు చేస్తున్నారు. ఈనెల 16 వరకు కొనసాగనుంది. ఇక సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఈ బెలూన్లు ఆకాశంలో విహరిస్తాయని నిర్వాహకులు తెలిపారు.

ఎంజీ మోటర్స్ నుంచి కొత్తఫీచర్స్‌తో ఆస్టర్



కొత్త మోడల్ ఆస్టర్ కారు

చెన్నై, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): వాహనాల తయారీలో వందేళ్ల చరిత్ర కలిగిన బ్రిటిష్ ఆటోమొబైల్ బ్రాండ్ మోరిస్ గ్యారేజెస్ (ఎంజీ) సంస అంబత్తూరు పారిశ్రామికవాడలోని షోరూంలో అత్యంత అధునాతన ఎస్‌యూవీ ఎంజీ ఆస్టర్ 2024 మోడల్ కారును ఆవిష్కరించింది. ఫ్రంట్ సీట్ వెంటిలేషన్, వైర్‌లెస్ ఛార్జెర్, వైర్‌లెస్ ఆండ్రాయిడ్, ఆటో అండ్ ఆపిల్ కార్ ప్లే, ఆటో డిమ్మింగ్ వంటి అద్భుతమైన ఫీచర్స్‌తో ఈ సరికొత్త కారు కస్టమర్లను బాగా ఆకట్టుకుంటుందని ఎంజీఆర్ మోటర్స్ ఇండియా డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ గౌరవ్ గుప్తా తెలిపారు. చెన్నై మార్కెట్‌లో ఈ కొత్త మోడల్ కారు రూ.9,98,000కు లభిస్తుందని ఆయన పేర్కొన్నారు.